# పారేసిన బతుకులు

— ఆగారాజు

దఫిలీవాలే......

దఫిలీ బజా-దఫిలీ బజా

మేరేఘుంగురూ-బులాతీహై

మైనాఛూ-తూనఛా......"

బ్యాండుమేళం వాళ్ళు ఆ హిందీ పాటను పరవశించి వాయిస్తున్నారు.

ఆ పాట మాధుర్యానికి రోడ్డున వెళ్ళే జనాలు ఆగిపోయి, ఆ పాటను వింటున్నారు.

అది ఒక పెళ్ళి వారి ఊరేగింపు (బారాత్) లో బ్యాండు మేళం వాళ్ళు పాడుతున్న పాట.

ఆ ఊరేగింపు చాలా ఖరీదయిన మనుషులకు సంబంధించింది.

ఆ ఊరేగింపులో అందరూ ఖరీదయిన మనుషులే వున్నారు.

ఆడవాళ్ళు ఖరీదయిన చీరలను బొడ్డు క్రిందికి కట్టుకుని, వారి హైక్లాస్ ఫాషన్స్ ప్రదర్శిస్తున్నారు. మగవాళ్లు ఖరీదయిన సూట్లలో వారి అంతస్థులను చూపుతున్నారు. యువతీ యువకులకు జీన్స్, డిస్కో డ్రెస్సుల్లో ఆల్ట్రా మోడరన్‌గా వున్నారు. చిన్న పిల్లలు, మాక్సీలలో, మిడీలలో ధనవంతుల పిల్లలమనే దర్జాను చాటుతున్నారు.

ఆ ఊరేగింపులో పూలరథంలాటి ఒక కారుంది. దానిని అందమయిన రంగు కాగితాలతో, రాశి పోసినట్లున్న పూలతో అలంకరించారు. ఆ పూల మధ్య నుంచి రంగు రంగుల మెరుపు కాగితాలు, లైటు వెలుగులో జిగేల్‌మని మెరుస్తున్నాయి.

ఆ పూల రథం మీద, ఖరీదయిన పెళ్ళి దుస్తుల్లో, ఖరీదయిన అదంమున్న వధూవరులు కూర్చున్నారు. వాళ్ళకిద్దరి కిరుపక్కల అప్సరసలలాటి యువతులు కూర్చుని, ఖరీదయిన నవ్వులు నవ్వుతున్నారు.

ట్యూబులైట్ల కాంతిలో వధూవరుల అందం, వారు ధరించిన దుస్తులూ మెరిసి పోతున్నాయి.

ఆ నవదంపతులు పూలఘుమఘుమలలోవెన్నెల్లాంటి వెలుగులో, గాలిలో వ్యాపించిన ఖరీదయిన సెంటు పరిమళంలో ఖరీదయిన కలలుకంటున్నారు.

వాళ్ళిద్దరి వూహలు, కాశ్మీర్-డార్జిలింగ్-సిమ్లా-ఊటీ మొదలైన సుందర ప్రాంతాల్లోవిహరిస్తున్నాయి.

ఆ ఊరేగింపు కారు ముందు బ్యాండు మేళం వాళ్ళు, రంగురంగుల యూనిఫారంలో రెండు వరుసలుగా నిలబడి వున్నారు. వారి మధ్యన యూనిఫారం లేని బ్యాండు మాస్టర్ నిలబడి, రెండు చేతులను వూపుకుంటూ, వాళ్ళను పురమాయిస్తున్నాడు.

ఆ కారు వెనుక రెండు వరుసల్లో, ముసలి వాళ్ళు, పిల్లలు కూర్చున్న రిక్షాలు చాలా దూరం వరకు వున్నాయి.

బ్యాండు వాళ్ళ కిరుప్రక్కల, రెండు వరుసల్లో ట్యూబులైట్లు మోసే వాళ్ళు నిలబడివున్నారు.

వెలుగును వెదజల్లేలైట్లను మోస్తున్న వాళ్ళకళ్ళలో కాంతిలేదు. ఆ నవనాగరికపు గుంపులో నిలబడిన వాళ్ళ శరీరాలమీద సరిగా దుస్తులులేవు. వున్న కాస్త గుడ్డలు కూడా చిరిగిపోయి మురికిపట్టి వున్నాయి.

ఆ ఖరీదయిన మనుషుల మధ్యన, వాళ్ళు మసి బొగ్గుల్లా, దిష్టి బొమ్మల్లావున్నారు.

వాళ్ళ కళ్ళల్లో అమాయకత్వం, ఆకలి వున్నాయి.

వాళ్ళలో కొందరు ముష్టివాళ్ళు, కొందరు లంబాడీ కూలివాళ్ళు-ఆడ, మగ, పిల్లలు వున్నారు.

వాళ్ళందరి తలలు మట్టి కొట్టుకుని వున్నాయి.

ఆ ప్రాణమున్న అస్థిపంజరాల వెనుక, పెళ్ళివాళ్ళు వెలుగు ప్రతిమల్లా, వెన్నెల బొమ్మల్లా వుత్సాహంగా కదులుతున్నారు.

ఊరేగింపు నెమ్మదిగా, వెన్నెల ప్రవాహంలా, పరిమళం వెదజల్లే పిల్లగాలిలా ముందుకు సాగుతుంది.

"లైట్లు బాగా పట్టుకోండి......"

ఆ గుంపులో నుండి ఒక పెద్ద మనిషి ఖరీదుగా అరిచాడు.

నిద్ర వస్తున్న లంబాడీ ఆడ పిల్లలు కళ్ళు నులుపుకున్నారు. ఆవలింతలు వస్తున్న ముష్టి వాళ్ళు లైట్లను సరిగా పట్టుకున్నారు. ఆకలివేస్తున్న ముష్టి ముసలి వాళ్ళు డొక్కలు పిసుక్కుని లైట్లను పైకి లేపిపట్టుకున్నారు.

లైట్లు మోసే వారిలో అందరికన్నా ముందుగా వున్న గంగులుగాడు మాత్రం లైటును పైకి లేపలేదు. అది గమనించిన మరో పెద్ద మనిషి ఖరీదయిన బూతులు తిట్టాడు.

"ఒరేయ్ గాడిదా!......నీకేరా చెప్పేది...సరిగా పట్టుకో బేవకూఫ్...."

ఆ పెద్ద మనిషి వాణ్ని కొట్టినంత పని చేశాడు.

గంగులుగాడు అతికష్టం మీద, ట్యూబు లైటును కాస్త పైకి లేపిపట్టుకున్నాడు.

గంగులు గాడికి ఆ లైటు లేపిపట్టుకునే శక్తి లేదు. వాడికి వారం రోజులుగా జ్వరం వస్తుంది. పైగా ఒక కాలుకుంటి, ఒక కంటిలో పువ్వు.

వారం రోజుల నుండి వాడు యెక్కడ అడుక్కోవటానికి వెళ్ళలేదు. అప్పటి నుండి పస్తులే వుంటున్నాడు.

ఆ రోజు గంగులు గాడికి జ్వరం కొంచెం తగ్గింది. ఒక ముష్టివాడు వచ్చి, ఆ ఊరేగింపు గురించి చెప్పాడు. వాడు' శక్తినికూడ దీసుకుని కడుపునింపుకుందామన్న ఆశతో, లైట్లు మోయడానికి వచ్చాడు.

ఆ సాయంత్రం మొదలయిన ఊరేగింపు, రాత్రి పది గంటలయినా ముగియలేదు.

ఆ ఊరేగింపు ఎప్పుడు గమ్యాన్ని చేరాలో, యెప్పుడు వాళ్ళు అన్నం పెట్టాలో, యెప్పుడు తన కడుపు మంట చల్లారాలోనని గంగులుగాడు ఆశతో యెదురుచూస్తున్నాడు.

ఆ ఊరేగింపు కదిలీ కదలనట్లు కదులుతూ, 'చార్మినార్ చుట్టూ తిరిగి' 'గుల్జార్‌హవుజ్' వైపు తిరిగింది.

'ఇక్కడ ఆపండి...'

ఓ పెళ్ళి పెద్ద కేకతో ఊరేగింపు చార్మినార్ ముందు ఆగింది.

అక్కడ రోడ్డు చాలా విశాలంగా వుంది.

ఊరేగింపు, చార్మినార్ మీద వేసే ఫోకస్ కాంతిలో ముచ్చటగా కనిపిస్తుంది.

పెళ్ళివారు అక్కడ ఆగినందుకు లైట్లు మోసే వాళ్ళకు విసుగనిపించింది. కాని వాళ్ళిచ్చే కూలి

రంజని

దబ్బులు, కడుపునింపే అన్నం జ్ఞాపకం రాగానే, మళ్ళీ వారిలో వుత్సాహం, శక్తి వచ్చాయి.

గంగులు గాడికి అలసటతో మళ్ళీ జ్వరం వచ్చింది. నిలబడలేక పోతున్నాడు. కాని, తిండి కోసం నిల్చోవాలని నిలబడడానికి ప్రయత్నించాడు. ఆకలి బాధను యెదుర్కోవడానికి శక్తిని కూడ గట్టుకున్నాడు.

బ్యాండు మేళం వాళ్ళు మరో పాట అందుకున్నారు.

'లైలా హూఁ లైలా లైలా
హైసీ మై లైలా...
హర్ కొయీ చాయే ముఝుకో
మిల్‌నా అకేలా......'

ఆ పాట యువకుల్ని గిలిగింతలు పెడుతోంది. వాళ్ళ మనసుల్లోకి మైకం కురుపిస్తోంది.

యువకులంతా ఆవేశంగా, యువతుల్ని డాన్స్ చేయమని బలవంతపెట్టారు.

ఆ పాట కదలింపుకు యువతులు మైమరచి పోయి 'డిస్కో' డాన్స్ చేస్తున్నారు.

యువకులు యీలలు వేస్తున్నారు.

పెద్ద వాళ్లు చప్పట్లు కొడుతున్నారు.

ఆ పాట ఆగిపోయింది,

డిస్కో డాన్స్ కూడా ఆగిపోయింది.

బ్యాండు వాళ్లు, పెళ్ళి వారు పాటను మెచ్చి బహుమానంగా యిచ్చిన రూపాయ నోట్లను తీసుకుంటూ, వుత్సాహంగా మరో పాటను అందుకున్నారు.

'యిన్నీ లోగోనే-యిన్నీ లోగోనే
యిన్నీ లోగోనే లేలీనాదు పట్టామేరా...'

ఆ పాటలోని మాధుర్యం ప్రాణాలు తోడేస్తోంది.

'ఆపండి...'

ఓ పెద్ద మనిషి అరిచాడు.

బ్యాండు ఆగిపోయింది.

'రాజాకి ఆయీ హైబారాత్' వాయించండి...

ఆ పెద్ద మనిషి, తన పెళ్ళి రోజులు గుర్తుకువచ్చి, ఆ పాత పాటను కోరాడు.

పాట మొదలయింది.

'నక్కోభాయ్...!
అప్‌జైసా కోయీ
జిందగీమే ఆయే
తోబాత్ బంజాయే-మారో...!'

ఓ అల్ట్రా మోడన్ యువకుడు కోరాడు.

'యస్...అదే కావాలి...'

మిగతా యువకులందరు పట్టు బట్టారు.

పెద్ద మనిషి ఓడి పోయాడు.

యువతులు నవ్వుకున్నారు.

పాట మొదలయింది.

'నాజియాహసన్' గొంతును 'మ్యూజిక్'లో ముంచి విని పిస్తున్నారు.

ఆ మ్యూజిక్ మాజిక్ చేస్తుంది.

ఆ పాట కురుపిస్తున్న మైకానికి, యువతీ యువకులు కలసి, మళ్ళీ 'డిస్కో' డాన్స్ చేయడం మొదలు పెట్టారు.

ఆ పాట రేపిన కైపులో అందరూ వాళ్లు మరిచి వూగిపోతున్నారు.

అందరూ చప్పట్లు కొడుతున్నారు, కేకలు వేస్తున్నారు.

బ్యాండు వాళ్ళకు చమటలు పట్టాయి.

రోడ్డున వెళ్ళే వారంతా గుమిగూడారు.

వధూవరులు మాత్రం యిదే మంచి అదననుకుని, యిద్దరూ యింకా దగ్గరకు జరిగి కూర్చున్నారు. పూల దండలను చాటు చేసుకుని, ఒకరి చేతిని ఒకరు సున్నితంగా రాసుకున్నారు.

పాట పరాకాష్ట అందుకుంది.

మ్యూజిక్ అందర్నీ నిలబడ నీయకుండా మెలికలు తిప్పుతోంది.

అందరూ తెలియని మైకంలో తూలిపోతున్నారు.

'డిస్కో' డాన్స్ చేస్తున్న వాళ్ళ దుస్తులు తడిసి ముద్దయ్యాయి.

పాట యింకా తీగలు సాగుతోంది.

'ఓఓఓ బాత్ బన్‌జాయే...

ఓఓఓ బాత్ బన్‌జాయే...'

డిస్కో వేగాన్ని పుంజుకుంది.

అందరూ ఆనందంతో వూగిపోతుంటే, లైట్లు మోస్తున్న వాళ్లు ఆకలి బాధతో తూలి పోతున్నారు. వాళ్ళ కళ్లు తిరుగుతున్నాయి. గట్టిగా నిలబడలేక పోతున్నారు.

పాట గొంతు చించుకుంటోంది.

డిస్కో వేగం యింకా హెచ్చింది.

గంగులు గాడికి జర్వం కూడా యింకా ఎక్కువయింది.

చలితో శరీరం వణికి పోతుంది. కళ్లు తిప్పుతున్నాయి. అంతా చీకటి కమ్ముకుంది. వాడింక లైటు మోయలేక పోయాడు.

భూమి గిర్రున తిరిగింది.

పెట్రోమాక్స్ లైటు తల క్రిందులయింది.

"అమ్మా......"

గంగులు గాడిగావుకేక ఆ చుట్టు ప్రక్కల ప్రతిధ్వనించింది.

జలపాతంలా దూకేపాట ఆగిపోయింది.

అక్కడ చుట్టు పక్కలనున్న బిల్డింగ్స్ కిటికీలు తెరిచి చూస్తున్న వాళ్ళ గుండెలు దడదడా కొట్టుకున్నాయి.

అందరు అటువైపు చూశారు.

గంగులుగాడు బోర్లాపడి పోయాడు.

వాడి తలకు, కాళ్ల చేతులకు దెబ్బలు తగిలి రక్తం వస్తోంది. వాడునేలకు కరుచుకుని మెలికలు తిరిగి పోతున్నాడు.

గంగులుగాడు మోస్తున్న లైటును యెవరో అందుకొని, పడిపోకుండా పట్టుకున్నారు.

గంగులుగాడు బాధతో విలవిలా కొట్టుకుంటుంటే, అందరు వాణ్ని చూసి విసుక్కున్నారు.

లైట్లు మోస్తున్న వాళ్ళలో కొందరు వాణ్ణి తట్టి చూసి స్పృహలేదన్నారు.

కొందరు వాణ్ని హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలన్నారు.

ఆ ఖరీదయిన మనుషులు మాత్రం వాణ్ని తిట్టుకున్నారు

'బారాత్' చెడగొట్టాడు వెధవ.......

గజ్జి కుక్కను కసురుకున్నట్లు కసురుకున్నారు.

'నిఖాలో యిదర్ సే...'

ఎంగిలి విస్తరాకును విసరి వేసినట్లు చీదరించుకున్నారు.

'ఆ లైటును యెవరో సమయానికి అందుకోకపోతే అందరి ప్రాణాలు తీసేవాడు గాడిద...'

రక్తంలో పడివున్న వాని మీద జాలిచూపకుండా, ఆ లైటు పగిలిపోయి షాక్ కొట్టి తమ ప్రాణాలు పోయేవేమోనని, వాణ్ని తిడుతూ అసహ్యించుకున్నారు.




'జల్దీహటావ్‌రే......'

ఓ పెద్ద మనిషి లైటుమోసేవాళ్ళను గద్దించాడు. కాని, వాళ్ళలో ఎవరూ కదలలేదు. వాళ్ళకు ఆకలి వేస్తోంది. వాళ్ళలో కూడా శక్తి నశించి కదల లేక పోతున్నారు. అది కాకుండా అక్కడి నుండి వెళ్ళి పోతే, వాళ్ళకు అన్నం పెడుతారో లేదోనని భయ పడుతున్నారు.

ఆ ఊరేగింపు చూడవచ్చిన వారిలో ఎవరో ఒక దయామయుడు, రిక్షాను పిలిచి గంగులుగాడిని లేపి రిక్షాలో కూర్చో బెట్టి, వాణ్ని పడిపోకుండా పట్టుకుని, ఉస్మానియా హాస్పిటల్ వైపు వెళ్ళాడు.

గంగులుగాడి లైటును మరో కూలి కుర్రాడు మోస్తున్నాడు.

బ్యాండు వాళ్లు మళ్ళీ పాట అందుకున్నారు.

ఖరీదయిన మనుషులు, జరిగినదంతా మరిచి పోయి, ఆనందంగా ముందుకు సాగిపోయారు.

ఒకరోజు—

'ముస్లిమ్ జంగ్ పూల్' మీద కొందరు ముష్టివాళ్లు, కూలివాళ్లువచ్చిపోయేజనాలనుడబ్బులుఅడుగుతున్నారు.

అక్కడే పేవ్‌మెంట్ మీద, మాసిపోయిన తెల్లని గుడ్డకప్పినశవముంది.

"బాబూ...ధర్మం చెయ్యండి"

"అమ్మా...యీ దిక్కులేని పీనుగు మీదదయ చూపి, చావుకు సాయంచేయండి..."

"అయ్యా !..."

"దొరా !..."

"సార్ !..."

వాళ్లు డబ్బాల్లోని చిల్లరను గలగలా వూపుకుంటూ అడుగుతున్నారు.

ఆ శవం మీద కొంత చిల్లర డబ్బులు పడివున్నాయి.

'సార్-సార్-సార్-మీకు దండాలు సాబ్...'

ఇద్దరు వస్తున్న స్కూటర్‌ను ఆపి, డబ్బాను గల గలా వూపి అడిగారు.

ఆ స్కూటర్ మీద కూర్చున్న దంపతులు వాళ్ళను అసహ్యించుకున్నారు.

'చల్ హటో...'

వాళ్ళిద్దరు కసురుకున్నారు.

స్కూటర్ ముందుకు సాగిపోయింది.

ఆ దంపతుల ఊరేగింపులోనే లైట్లు మోసిన గంగులుగాడి శవమని వాళ్ళకెలా తెలుస్తుంది?...... ఎందుకు తెలుస్తుంది?

వాళ్ళ ఖరీదయిన జీవితాలముందు, గంగులుగాడి లాటి వాళ్ళ బ్రతుకుల విలువెంత?

వాళ్ళ ప్రాణాల ఖరీదెంత?

ఖరీదయిన మనుషుల సుఖజీవనానికి తొక్కుడు బండలు వీళ్ళ ప్రాణాలు.

పారేసిన యెంగిలాకుకన్నా హీనము వీళ్ళ బ్రతు కులు.

ఆ సాయంత్రం నాలుగు గంటల వరకు వాళ్ళు అడుక్కున్నారు.

వాళ్ళు డబ్బులు అడుక్కుంది గంగులుగాడి చావు కొరకు కాదు. వాడి శవం పేరు మీద వచ్చినడబ్బుతో వాళ్ళ ఆకలి మంటలు చల్లార్చుకోవాలని.

గంగులుగాడు ఆకలి తీరడానికి ఆకలి నిమోస్తూ, ఆకలితో చచ్చాడు.

ఆ ఆకలి శవాన్ని, ఆ ఆకలి అస్థిపంజరాలు, ఆకలితో పూడ్చి పెట్టడానికి బయల్దేరాయి.

జీవితంలో ఆఖరి మజిలీకి, గంగులుగాడి శవం ఊరేగి వెళుతుంది.

ఆ ఊరేగింపులో సందడి లేదు.

ఆ ఊరేగింపులో సంతోషం లేదు.

అక్కడి మనుషుల కడుపులో దుఃఖం లేదు. వాళ్ళ కళ్ళల్లో కన్నీరు లేదు.

ఆకళ్ళల్లో-వాళ్ళ డొక్కల్లో కేవలం ఆకలి మాత్ర ముంది.

అలా ఆ ఊరేగింపు నిశ్శబ్దంగా 'స్మశాన్‌ఘాట్' వైపు సాగిపోయింది.